www.manaveluguepaper.in

# మన వెలుగు

తెలుగు దినపత్రిక — ప్రతి అక్షరం జనం కోసం

www.manaveluguepaper.in

సంపుటి:1 సంచిక:274 | గురువారం 4-6-2026 | పేజీలు:4 | వేల:3

## సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయం..




3లో..


## మెడికల్ టూరిజంలో పరస్పర సహకారం

■ దక్షిణాఫ్రికా ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

■ హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల ప్రత్యేకతలపై చర్చ

■ భారత్‌తో సౌత్ ఆఫ్రికాది చారిత్రక బంధం: ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే

■ తెలంగాణ 'రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'కు ఆహ్వానం



హైదరాబాద్, జూన్ 3: రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడులు, విద్య, వైద్య సేవలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం మరో కీలకమైన అడుగు వేసింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో కీలక సమావేశం నిర్వహించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు పక్షాలు చర్చించాయి. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి తెలంగాణ.. ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను ఆ ప్రతినిధులకు వివరించారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనేక ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్-500 కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు హైదరాబాద్‌ను నాలెడ్జ్ సిటీగా మార్చాయని తెలిపారు. వైద్య రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మధ్యప్రాచ్య దేశాలతోపాటు అనేక దేశాల ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. అత్యాధునిక హాస్పిటల్స్, నిపుణులైన వైద్యులు, మెరుగైన ఆరోగ్య మౌలిక వసతులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు.

**మెడికల్ టూరిజంకు ప్రత్యేక స్థానం**

హైదరాబాద్‌ను **మిగతా 2లో..**


### తెలంగాణతో తురింగియా భాగస్వామ్యం

- టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారానికి ఒప్పందం
- తెలంగాణ రైజింగ్ విజన్‌పై జర్మనీ ప్రతినిధుల ప్రశంసలు

2

## విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి భారీ ఆర్థిక భరోసా

**మృతుడి భార్యకు రూ.కోటి ప్రమాద బీమా చెక్కు అందజేత**




హైదరాబాద్, జూన్ 3 : ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రమాదవశాత్తు లైన్‌మన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ మృతిచెందగా ఆయన సతీమణి స్వప్నకు రూ.కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో బుధవారం అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎన్పీడీసీఎల్‌కు గతంలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం యూఎస్ఎస్ఏ -2, యూఎస్ఎస్ఏ-3 పథకాల కింద సాలరీ ఖాతాలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రూ.కోటి విలువైన వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్పీడీసీఎల్ బాసర పరిధిలో లైన్‌మన్ ప్రమోద్ కుమార్ 23 సెప్టెంబర్ 2024న బాసర శాఖలో తన యూఎస్ఎస్ఏ-2 జీతానికి సంబంధించి ఖాతాను ప్రారంభించారు. దురదృష్టవశాత్తు ఆయన గత ఏడాది మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆయన అకాల మరణం తర్వాత మృతుని నామినీ అయిన స్వప్న క్లెయిమ్ దరఖాస్తును బాసర శాఖలో సమర్పించారు. ఈ క్రమంలో రూ.కోటి బీమా మొత్తం గత నెల 30న స్వప్న సేవింగ్స్ ఖాతాలో జమ అయింది. ఈ క్లెయిమ్ వేగంగా పరిష్కారం కావడం అనేది ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వానికి, బ్యాంకింగ్ రంగానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. అలాగే సాలరీ ప్యాకేజ్ పథకాల కింద అందిస్తున్న బీమా ప్రయోజనాల ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రజాభవన్‌లో జరిగిన చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంకు సీఈవో అశిష్ పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమరేష్ ప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్ర బాబు, నిజామాబాద్ రీజినల్ హెడ్ అరుణ సవిత, చీఫ్ మేనేజర్ వై.వి.రాఘవ, బ్రాంచ్ మేనేజర్ విజయ్ కుమార్, తదితర ఉన్నతాధికారులు పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

## సీఎంగా డీకే ప్రమాణ స్వీకారం

**సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి హాజరు**



బెంగళూరు, జూన్ 3 : బెంగళూరులోని లోక్‌భవన్‌లో బుధవారం వైభవంగా జరిగిన కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డి.కె.శివకుమార్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ప్రత్యేకంగా హాజరయ్యారు. తమ ఆహ్వానాన్ని మన్నించి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన రేవంత్, భట్టి విక్రమార్కలకు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. సీఎం రేవంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మంత్రివర్గ సభ్యులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కేరళ ముఖ్యమంత్రి సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితర ప్రముఖులు కూడా హాజరయ్యారు.

### సిరిసిల్ల సిగలో సరికొత్త మణిహారం

- నేతన్నల ఆత్మగౌరవానికి 'జోట' నిలువెత్తు సాక్ష్యం
- కలెక్టరేట్ జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా స్టాచ్యూ
- తుదిదశకు చేరిన సుందరీకరణ పనులు.. త్వరలోనే ప్రారంభం

12





### ఆధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

- అవకాశాలు కల్పించేలా ఎకో సిస్టం అభివృద్ధి
- బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దుతాం
- 'థెరానిమ్ బయోలాజిక్స్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

12




12

### 'జూబ్లీ' వద్ద ప్రయాణికులపైకి దూసుకెళ్లిన బస్సు

- బస్సు చక్రాల కింద ఇరుక్కున్న యువకుడు
- క్రేన్ సాయంతో యువకుడికి విముక్తి..హాస్పిటల్‌కు తరలింపు

## తెలంగాణ భూమిపుత్రుల జాగీరు

- ప్రజలంతా కలిసుండాలని కోరుకుంటున్నాం
- జనసేన పార్టీని పోటీ చేయొద్దని ఎవరన్నారు?
- గత ఎన్నికల్లో పోటీచేశారు కదా!
- ఉపముఖ్యమంత్రిగా, కళాకారుడిగా పవన్‌ను గౌరవిస్తాం
- తెలంగాణ ఆవిర్భావ దినం నాడు మీటింగ్ పెట్టడం సరికాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,జూన్ 3: మీ అయ్య జాగీరా? అని ప్రశ్నించిన పవన్ కళ్యాణ్ ఒక్కటి మాత్రం గుర్తుపెట్టుకోవాలి. తెలంగాణ కచ్చితంగా తెలంగాణ భూమి పుత్రుల జాగీరు. ఇందులో ఎవరికీ అనుమానం కూడా అక్కర్లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మీ కుటుంబాలు ఇక్కడే ఉన్నాయి, మీ వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ఉండండి, ఎవరొద్దన్నారు? 10, 12 ఏళ్లలో ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిందా? ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నామని గుర్తుచేశారు. పవన్ కళ్యాణ్ ప్రాంతీయవాదం అన్నారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్నారు నేను వారికి గుర్తు చేస్తా ఉన్నా ప్రాంతీయవాదం అంటే... మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం వేర్పడాలని పొట్టి శ్రీరాములు గారు 58 రోజులు నిరాహార దీక్ష చేశారు, దాన్ని కూడా ప్రాంతీయవాదం అంటారా? అని ప్రశ్నించారు. ఈ నేల ఆనాడు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేల. కమ్యూనిస్టులు కదంతొక్కిన నేల ఇది. కాబట్టి మాకు పోరాటాలు కొత్తగాదు, మాకు యుద్ధాలు కొత్తగాదు, త్యాగాలు కొత్తగాదు. మాకు వాటి గురించి జాతీయ భావన ఉంది. ఇక్కడ, దేశాన్ని గౌరవించే సంస్కృతి ఉంది. పవన్ ను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా వారిని గౌరవిస్తాం. ఒక కళాకారుడిగా, ఒక నటుడిగా అభిమానిస్తాం. ఒక సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం. కానీ, వచ్చి మా సెక్రటేరియట్‌లో కూర్చొని పెత్తనం చేస్తాం అంటే **మిగతా 2లో..**


### వొచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా

- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే
- మీట్ ది ప్రెస్ లో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ప్రజాతంత్ర, జూన్ 3: వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. **మిగతా 2లో..**

## రెండు రోజులు భారీ వర్షాలు

- 18 జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ!
- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరిక



హైదరాబాద్,జూన్ 3: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడి న వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి **మిగతా 2లో..**

### నేడు కేరళను తాకనున్న నైరుతి

- తమిళనాడు తదితర ప్రాంతాలకు విస్తరణ

హైదరాబాద్,జూన్ 3:నైరుతి రుతుపవనాలు రాబోయే 24 గంటల్లో కేరళంలోకి ప్రవే శించనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తద్వారా క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించనున్నాయి. గురువారం నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు.

## శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

- క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త విలువల నిర్ణయం
- ఈ నెల 5 నుంచి అమలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



హైదరాబాద్,జూన్ 3 : రాష్ట్రంలో భూముల విలువలను సవరించాలని, వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్నచోట్ల క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు సవరించిన భూముల విలువలు ఈ నెల 5 నుంచి అమలులోకి వస్తాయని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా, అశాస్త్రీయ పద్ధతుల్లో 2021-22 సంవత్సరాల్లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు భూముల ధరలను పెంచడంతోపాటు రిజిస్ట్రేషన్ చార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందన్నారు. శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం చేపట్టడం **మిగతా 2లో..**



### ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 21 మంది దుర్మరణం
- ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, జూన్ 3: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం **మిగతా 2లో..**

మన వెలుగు
తెలుగు దినపత్రిక ప్రతి అక్షరం జనం కోసం
www.manaveluguepaper.in



## మొదటిపేజీ పేజీ తరువాయి

# మెడికల్ టూరిజంలో పరస్పర సహకారం



ప్రపంచస్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గత ఏడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 భారీ విజయాన్ని సాధించిందని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026లో పాల్గొనాలని పాల్ మషాటిలేతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించగా ఉపాధ్యక్షుడు స్పందించి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. తెలంగాణ–దక్షిణాఫ్రికా మధ్య విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో కొత్త సహకార అవకాశాలకు మార్గం సుగమమైందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును గురించి కూడా సీఎం వివరించారు. పూర్తిగా పర్యావరణహితంగా, నెట్ జీరో విధానంలో, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనా కేంద్రాలకు ఇది కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు ఉందన్నారు.ఆరోగ్యరంగంలో భాగస్వామ్యం ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.

**భారత్‌తో సౌత్ ఆఫ్రికాది చారిత్రక బంధం: మషాటిలే**

భారత్‌తో దక్షిణాఫ్రికాది చారిత్రక బంధమని, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు కొనసాగుతున్నాయని ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే అన్నారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలు ఆఫ్రికా మార్కెట్లలోకి విస్తరించేందుకు దక్షిణాఫ్రికా కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ప్రత్యేకంగా ఫార్మా, ఆరోగ్య రంగాల్లో భారత కంపెనీలకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో దక్షిణాఫ్రికా అంతర్జాతీయ సంబంధాల ఉప మంత్రి మొరాకా, భారత్‌లోని దక్షిణాఫ్రికా రాయబారి ఎ.సూక్‌లాల్, ఆరోగ్య మంత్రి డాక్టర్ ఎ. మోట్సోలెడీ, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ఎం డాబేని, విజ్ఞాన సాంకేతిక శాఖ ఉప మంత్రి ఎన్.గినా, కమ్యూనికేషన్స్, డిజిటల్ టెక్నాలజీ శాఖ ఉపమంత్రి ఎం.గుంగుబెలే తదితరులు పాల్గొన్నారు. మన రాష్ట్రం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణతో తురింగియా భాగస్వామ్యం

హైదరాబాద్,జూన్ 3: వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమైన తెలంగాణతో జర్మనీలోని తురింగియా రాష్ట్రం పలు కీలక రంగాల్లో భాగస్వామ్యానికి ముందుకొచ్చింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం, జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. తురింగియా ముఖ్యమంత్రి మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. తెలంగాణను భారత దేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారియో వోయిట్ అభివర్ణించారు. తెలంగాణ రైజింగ్–2047 విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని అన్నారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని వివరించారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలకు స్పందించిన మారియో వోయిట్ తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుతున్నారంటూ అమెరికాలోని సిలికాన్ వ్యాలీ విజయాల్లో కీలక పాత్ర పోషించినట్లు గుర్తు చేశారు. ప్రపంచంలోని అనేక అగ్రశ్రేణి సంస్థల్లో హైదరాబాద్‌కు చెందినవారే కీలక పదవుల్లో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో జర్మన్ భాషా పరిజ్ఞానం కూడా ఎంతో అవసరమని, జర్మన్ భాషా శిక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంలో సహకరించాలని తురింగియా ప్రతినిధులను సీఎం రేవంత్ కోరారు. భారత్ ఫ్యూచర్ సిటీ గురించి కూడా వివరించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ -500 కంపెనీలను తెలంగాణకు ఆకర్షించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నామని తెలిపారు. ఇటీవల మిస్ వరల్డ్–2025 పోటీలకు వందకుపైగా దేశాల ప్రతినిధులు రావడం రాష్ట్ర ప్రతిష్ఠకు నిదర్శనమన్నారు.

**సెమీ కండక్టర్ రంగంలో కొత్త అవకాశాలు**

సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తురింగియా సీఎం తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ స్వాగతిస్తూ ఇప్పటికే అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ(టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. ఏటీసీలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను పరిశీలించవచ్చని సూచించారు. తురింగియా స్టేట్ సెక్రటరీలు డాక్టర్ టైచార్ట్, సకెర్ట్, జర్మన్ కాన్సుల్ జనరల్ హాస్పర్ సహా వివిధ రంగాలకు సంబంధించిన జర్మనీ పారిశ్రామికవేత్తలు, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, టీజీఐఐసి ఎండీ శశాంక పాల్గొన్నారు.

# వొచ్చే ఏడాది  పాదయాత్ర చేస్తా

పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడుపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతున్నదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నవన్నీ కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.



కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి హాజరైన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో వైభవంగా జరిగిన ప్రమాణ స్వీకారం  మహోత్సవానికి హాజరైన భట్టి విక్రమార్కకు డి.కె. శివకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

## 136కు పైగా గొర్రెలు మృత్యువాత

దేవరకొండ,జూన్ 03: డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారు పరిధిలోని కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై  తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో  136 పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి చిట్టేగొండ ఎల్లయ్య(35) గుంటూరు జిల్లా నుండి డీసీఎం వాహనంలో గొర్రెలను ఎక్కించుకొని మంగళవారం తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన మరో వాహనాన్ని గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టడంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో 136 కు పైగా గొర్రెలు కూడా మృతి చెందాయి. గొర్రెలను తీసుకెళ్తున్న డీసీఎం డ్రైవర్ రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరు

ఒప్పుకోమని కుండబద్దలు కొట్టారు.  ఈ దేశంలో ఏ నాయకుడైనా, ఏ నాయకురాలైనా పార్టీ పెట్టవచ్చు. పార్టీ పెట్టి ఎక్కడైనా పోటీ చేయవచ్చు. ఏ ప్రాంతంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా నిరభ్యంతరంగా పోటీ చేయవచ్చు. ప్రజాస్వామ్య భారతదేశంలో అది అందరికీ ఉన్న హక్కు, రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఇందులో ఏమీ అనుమానం పడక్కర్లేదు. కానీ, ఏ ప్రాంతంలోనైతే మీరు పోటీ చేయాలనుకుంటున్నారో, ఆ ప్రాంత ఆకాంక్షలు, ఆ ప్రాంత పరిస్థితులు, ఆ ప్రాంత ప్రజలు, వారియొక్క మనోభావాలు, వారి పోరాటాలు, వారి యొక్క త్యాగాలు కూడా మీరు తెలుసుకోవాలి, వారి మీద అభిమానం ఉండాలన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీచేసింది కదా. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు కదా 350 వార్డుల్లో, కొత్తగా చేసేదేముంది? మిమ్మల్ని ఎవరు ఆపుతున్నారు? 2018లో చంద్రబాబు నాయుడు వచ్చారు, పోటీ చేశారు. 23లో మీరు పోటీ చేశారు. పోటీ చేయండి, ఎవడొద్దంటున్నాడు? కాబట్టి ఇక్కడికి వచ్చినప్పుడు, ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని మాట్లాడాలి. జనసేన ను ఎవరు అడ్డుకుంటున్నారు మిమ్మల్ని?  పవన్ కళ్యాణ్  11 రోజులు అన్నం ముట్టకుండా ఉంటే, మళ్లీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టాల్సిన అవసరం ఉందా? మీటింగ్ పెడదాం అనుకున్నావ్, అడ్డుకున్నదెవరు? కాంగ్రెస్ ప్రభుత్వం. ఏమన్నా అనాలనుకుంటే వాళ్లననాలి. కాబట్టి, పవన్ కళ్యాణ్ గారైనా ఎవరైనా ఈ దేశంలో ఎక్కడైనా పోటీ చేయొచ్చు, మాకు అభ్యంతరం లేదు.

# శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువల నిర్ణయం జరిగినట్లు తెలిపారు. వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను రూపొందించి ఆమోదించాయని చెప్పారు. ప్రాంతతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవలి భూముల వేలాలు, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, వృద్ధి కారిడార్లు, ఔటర్, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విలువలను నిర్ణయించినట్లు తెలిపారు. ఫ్లాట్ల విషయంలో గతంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అంతస్తుల వారీగా అధిక రేట్లు నిర్ణయించడం వల్ల అసమానతలు ఏర్పడ్డాయని, అలాంటి చోట్ల అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించినట్లు వివరించారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదన్నారు. అలాగే ప్రాంతాల అభివృద్ధి స్థాయినిబట్టి హెచఎండీఏ, క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నిర్మాణ వ్యయాలను కూడా 2021 తర్వాత సవరించలేదని, గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ రేట్ల సవరణ అవసరమైందని పేర్కొన్నారు. అనేక మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సీసీ, నాన్–ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సవరణలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూ లావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు.

### రాష్ట్రంలో రూ.7,597.16 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణ

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

న్యూఢిల్లీ,  జూన్ 3 : తెలంగాణలోని రెండు ముఖ్యమైన జాతీయ రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. విస్తరించే రహదారుల పొడవు మొత్తం 190.76 కి.మీ ఉండనుంది. వీటిలో ఎన్‌హెచ్–63 ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల సెక్షన్, ఎన్‌హెచ్–563 జగిత్యాల–కరీంనగర్ సెక్షన్ ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్), 'బిల్డ్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్ (బీవోటీ–టోల్) పద్ధతుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్మూర్–మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం గంట 30 నిమిషాలు తగ్గుతుందని, జగిత్యాల – కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం 45 నిమిషాలు తగ్గుతుందని తెలిపారు. దీని వల్ల పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి సరుకు రవాణా సులభతరం అవుతుందని, పీఎం గతిశక్తి' పరిధిలోకి వచ్చే ఈ ప్రాజెక్టుల వల్ల ఇంధనం ఆదా అయి, కాలుష్యం తగ్గుతుందని వివరించారు.

# రెండు రోజులు భారీ వర్షాలు

రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రాణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్ లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు.

# మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

- **ఈ ఏడాది వర్షపాతం తక్కువ నమోదయ్యే అవకాశం**
- **ఖరీఫ్ సాగు ప్రణాళిక సమావేశంలో మంత్రి తుమ్మల**

ఖమ్మం,జూన్ 3 : వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో  జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి



అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసింద న్నారు.

కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్–అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో దళారుల దందా..!

- రాజ్యం నడుపుతున్న ఇంటి విజ్ఞానులు..!
- కమిషనర్ ఆగ్రహంతో సిబ్బందికి క్లాస్
- ప్రజల పనుల పేరుతో భారీ వసూళ్లు
- కార్యాలయంలో మధ్యవర్తుల హవా
- అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువ

**ఖమ్మం, జూన్ 3 (మన వెలుగు):** మున్సిపాలిటీ కార్యాలయంలో దళారుల హవా మితిమీరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న పని నుంచి పెద్ద పని వరకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఫైళ్లు కదలడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికీ రేట్లు ఫిక్స్ చేసి అమాయక ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా కార్యాలయ పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాల్సిందిపోయి, కొంతమంది సిబ్బంది దళారులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ప్రజలు నేరుగా అధికారులను కలవకుండా మధ్యవర్తుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాపోతున్నారు. కార్యాలయం వద్ద రోజూ దళారుల సందడి కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.

ఇకపై ఇలాంటి వ్యవహారాలు సహించబోమని కమిషనర్ హెచ్చరించినట్లు తెలిసింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం..

# రక్షణ వెల్ఫేర్ సొసైటీ పునరావాస కేంద్ర స్థల పరిశీలన..

- త్వరితగతిన పూర్తికానున్న ప్రాజెక్టు..
- హర్షం వ్యక్తం చేసిన రక్షణ వెల్ఫేర్ సొసైటీ బృందం...








**మన వెలుగు ప్రతినిధి :** అందరూ ఉండి అనాథగా మిగిలిపోయిన వయోవృద్ధులు... ఆసరా లేని వృద్ధ మహిళలు...., ప్రకృతి వైపరీత్యాలలో తల దాచుకునేందుకు పునరావాస కేంద్రం కోసం, కేవలం వృద్ధ మహిళల పరిరక్షణ కోసం రక్షణ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ముందుకు వచ్చి వృద్ధాశ్రమం, ఒ రక్షణ వెల్ఫేర్ పునరావాస కేంద్రం ఏర్పాటుకోసం రక్షణ వెల్ఫేర్ సొసైటీ వడివడిగా కార్యచరణను వేగవంతం చేసింది... అందులో భాగంగానే బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని హైవే రోడ్డు చెంతన 1600 గజాల విస్తీర్ణంలో సువిశాల ప్రదేశంలో వృద్ధ మహిళలకు తమ స్వస్థలాన్ని మైమరపించే విధంగా అన్ని ఏర్పాట్లను చేయబోతుంది రక్షణ వెల్ఫేర్ సొసైటీ సంస్థ.. అందులో భాగంగానే సంస్థ వ్యవస్థాపకురాలు పోలేపల్లి సుజాత మాట్లాడుతూ.. నిర్మాణ పనులు... ప్రభుత్వ అనుమతులు, పలు అంశాలలో కార్యచరణను వేగవంతం చేసినట్లు ఫౌండర్ సుజాత పేర్కొన్నారు.. వయవృద్ధుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు తమ నివాస సముదాయాలను తలపించే విధంగా సివిల్ ఇంజనీర్, ఇంటీరియర్ డిజైనర్లు ప్లానింగ్ ఆర్కిటెక్ట్‌లతో సమాలోచనలు చేసినట్లు ఆమె తెలిపారు. వృద్ధులు, నిరుపేదలు ఆపదలో ఉన్న వారికి ఈకేంద్రం ఉపయుక్తం కానుందని ఆమె అన్నారు.. సుజాత సామాజిక సేవలు ఆదర్శప్రాయమని పలువురు ఆమె సేవలను ప్రశంసిస్తున్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఖమ్మం మన వెలుగు ప్రతినిధి :** స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ నందు తెలంగాణ ఆవిర్భావ దిన్సోతవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు గారు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి గల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ "ఎందరో మహానుభావుల పోరాటాల ఫలితమే ఈ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం" అని 1956 నుంచి జూన్ 2, 2014 వరకు తెలంగాణ ఉద్యమం నీళ్ళు, నిధులు, నియమాకాలు అనే అజెండాతో తెలంగాణ ఉద్యమం జరిగిందని, ఈ ఉద్యమంలో వేల మంది తెలంగాణ విద్యార్థులు, ఉద్యమకారులు అమరులైనారని 1956 నవంబర్ 1న పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ఆంధ్రాలో తెలంగాణ విలీనమైనదని పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఆంధ్రా పాలకులు నిర్లక్ష్యం వలన 1969 నుండి తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనదని తెలియజేసారు. తెలంగాణ ఉద్యమ నేతలు ప్రొ॥జయశంకర్ సార్ వంటి ఉద్యమ కారుల మార్గదర్శకంలో అనేక పోరాటాలు, అలుపెరుగని ఉద్యమాలు అమరుల బలిదానాలతో కొనసాగి 2009 అక్టోబర్‌లో శ్రీకాంత చారి ఆత్మ బలిదానంతో మలిదశ ఉద్యమం ప్రారంభమై సఖల జనుల సహకారంతో 60 యేండ్ల సంకెళ్ళు తెంచుకొని 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మనందరం బాధ్యతతో రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి అమరవీరుల కలలను సాకారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో పాఠశాల డైరెక్టర్ కొండా క్రిష్ణవేణి గారు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను కొనియాడారు. బావి తరాలకు బంగారు తెలంగాణను మనమందరం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసినారు.



# సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయం..

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవజాత శిశువుల సంరక్షణకు ఆధునిక పరికరాల ఏర్పాటు
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూకు 9 లక్షల విలువైన వైద్య పరికరాలు అందజేత
- పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయి
- ఆసుపత్రి అభివృద్ధికి మరింత సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన కల్లా ఫౌండేషన్‌కు అభినందనలు






**ఖమ్మం మన వెలుగు ప్రతినిధి :** సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రశంసించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో ఏర్పాటు చేసిన 9 లక్షల విలువైన వివిధ ఆధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తన కుటుంబ పరిధిని దాటి సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు వచ్చే సంస్థలు, వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ప్రజలకు ఉపయోగ పడే విధంగా ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి, వైద్య సేవల విస్తరణకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని కలెక్టర్ తెలిపారు. సమాజంలో అవసరమైన రంగాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రానికి అందించిన ఆధునిక పరికరాలు అనేక మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారుల చికిత్సకు ఉపయోగపడతాయని చెప్పారు. నవజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ పరికరాలు ఎంతో దోహదపడతాయని, ఆసుపత్రిలో చికిత్స నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకారం కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎం. నరేందర్, కల్లా ఫౌండేషన్ చైర్మన్ పాపారావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వల్లభనేని రామారావు, ప్రతినిధులు పసుమర్తి రంగా రావు, సాంబశివ రావు, మేళ్ళచెరువు వెంకటేశ్వర్లు, ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు, తదితరులు పాల్గొన్నారు.

# జె.ఈ.ఈ అడ్వాన్స్ ఫలితాలలో తొలి అడుగులోనే విజయదుంధుభి మ్రోగించిన స్టెమ్‌స్పార్క్ కాలేజ్ విద్యార్థులు



**ఖమ్మం మన వెలుగు ప్రతినిధి :** స్థానిక శ్రీనగర్ కాలనిలోని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు జె.ఈ.ఈ. అడ్వాన్స్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభతో మంచి ర్యాంకులను సాధించి విజయదుంధుభి మ్రోగించారు. స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే జె.ఈ.ఈ. అడ్వాన్స్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే బి.అవినాష్ (172 ర్యాంక్), జె.అంజలి(748 ర్యాంక్), సి.హెచ్.వెంకట సాయి పవన్ (4828 ర్యాంక్) మరియు బి.ప్రవీణ్ (5609 ర్యాంక్)లను సాధించి విజయఢంకా మోగించడం జరిగింది.
ఈ సందర్భంగా స్టెమ్‌స్పార్క్ కాలేజ్ డైరెక్టర్ శ్రీ కొండా శ్రీధర్‌రావు గారు అత్యధిక ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు వారి లక్ష్యాలను సాధించడానికి స్టెమ్‌స్పార్క్ కాలేజ్ ఒక వారధిగా ఉంటుందని తెలియజేసారు. జె.ఈ.ఈ. మెయిన్స్, అడ్వాన్స్ మరియు ఎంసెట్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షలలో విజయాలను సాధించి ఐ.ఐ.టి., యన్.ఐ.టి మరియు ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీలలో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా తక్కువ మంది విద్యార్థులతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని సమకూర్చి నిరంతర పర్యవేక్షణతో అత్యద్భుతమైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని తెలియచేసినారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించినారు.

# కలిసికట్టుగా ఉద్యమిస్తాం... పాఠశాలను సాధించుకుంటాం

- ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ కన్వీనర్ తోటపల్లి శంకర్



**జవహర్ నగర్, మన వెలుగు ప్రతినిధి :** కలిసికట్టుగా ఉద్యమించి... ప్రభుత్వ పాఠశాలను సాధించుకుంటామని, చదువుతోనే చిన్నారుల భవిష్యత్తు మారుతుందని ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ కన్వీనర్ తోటపల్లి శంకర్ అన్నారు. గబ్బిలాల్ పేటలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జవహర్నగర్ లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో పాఠశాల సాధన కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పేదల బతుకులు మారాలంటే చదువే ఆయుధమని, గబ్బిలాల్ పేట చిన్నారులకు చదువు అందక దూరం అవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలను కేటాయించాలని కోరారు. ఇప్పటికే స్థానిక ప్రజలు వేలాదిమందితో సంతకాల సేకరణ చేశామని, ప్రజా ప్రతినిధులను, జిల్లా యంత్రాంగాన్ని కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. అనంతరం వందలాది మందితో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ షావలి, కాలేషా, నర్సింహాగౌడ్, సదానందం, యాదగిరి, శివన్నారాయణ, సురేష్కుమార్, శివబాబు, సావిత్రి, జయసుధ, మంజుల స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు నెరవేరిన సొంత ఇంటి కల...

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇండ్లు...
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి...





**కీసర, మన వెలుగు ప్రతినిధి :** నిరుపేదలకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో సొంత ఇంటి కల నెరవేరిందని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం నాగారం డివిజన్ పరిధిలోని శిల్పానగర్ లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ఆయన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇండ్ల యజమానులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ కలలుగన్న ఆశయాలను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన గుర్తు చేశారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబీకులకు సొంత ఇంటి కల నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, పంగ హరిబాబు, సుమిత్ర సురేష్, మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, మాజీ ఎంపీటీసీ లు పంగ ముత్యాలు, కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, యువ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, వంగేటి పర్వత్ రెడ్డి, కౌకుట్ల శ్రీనివాస్ రెడ్డి, కందాడి శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, భద్రు నాయక్ , పంగా సంతోష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.